క్లుప్తంగా

శేషు కుటుంబానికి అబ్బయ్యచౌదరి పరామర్శ



కూచింపూడిలోని చేగు శేషు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : కుటుంబంలోని వ్యక్తిని కోల్పోవడం ఎవ్వరూ తీర్చలేని లోటని దెందులూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన చేగు శేషు ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను అబ్బయ్యచౌదరి పరామర్శించారు. అనంతరం స్థానిక నాయకులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మెట్లపల్లి సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కాళి చినబుడ్డియ్య తదితరులు పాల్గొన్నారు.

యోగ, ధ్యానం మానవ మనుగడకు మూలాధారం



యోగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు

దెందులూరు: యోగ, ధ్యానం ప్రతి మనిషి మనుగడకు మూల ఆధారాలని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. సోమవారం దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో జూనియర్, సీనియర్ నర్సింగ్ విద్యార్థులకు యోగ, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. యోగ, ధ్యాన సాధన వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యంగా జీవించవచ్చని అధ్యాపకులు వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో అఖిల్ ప్రతిభ



పీడీ పద్మావతితో అఖిల్

గణపవరం: గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.అఖిల్ శ్రీవర్మ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచినట్లు పీడీ పద్మావతి తెలిపారు. విజయనగరం జిల్లా భోగాపురంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకూ నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రధాన టీంలో పాల్గొని 4వ స్థానం సాధించాడని తెలిపారు. అఖిల్‌ను అతనికి శిక్షణ ఇచ్చిన పీడీ పద్మావతిని హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు.

14 నుంచి జోనల్ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్

భీమడోలు: పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు గురుకుల పాఠశాలల జోనల్ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ సోమవారం రాత్రి తెలిపారు. ఈనెల 14న ఉదయం 10 గంటలటకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈనెల 17న 11 గంటలకు ముగింపు ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లోని 29 గురుకుల పాఠశాల విద్యార్థినులు పాల్గొంటారని ఆమె తెలిపారు. ఆటల పోటీతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

భీమడోలు: సూరప్పగూడెంలో అక్రమంగా మద్యం విక్రయిన్న ఓ వ్యక్తిని భీమడోలు పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.100 విలువ గల 10 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూరప్పగూడెంలోని ఎస్సీ కాలనీ శివారు ప్రాంతంలో భీమడోలు పంచాయతీ పరిధిలోని అరుంధతీ కాలనీకి చెందిన ఎనిగళ్ల రాంబాబు మద్యం బాటిళ్లను అక్రమంగా నిల్వ ఉంచి బెల్టు షాపు నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న భీమడోలు ఎస్సై వై.సుధాకర్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

105 కుటుంబాలకు 'చేయూత'

దెందులూరు: ఆర్థికంగా సామాజికంగా కుటుంబ పరంగా ఎటువంటి ఆసరాలేని వారికి, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న ప్రత్యేక అవసరాలు గల వారికి, విద్య వైద్య, మౌలిక వసతులు కల్పనలో స్వచ్ఛంద సేవా సంస్థ చేయూత సేవలందిస్తోందని సంస్థ ప్రతినిధులు అన్నారు. దెందులూరులో వారు మాట్లాడుతూ 2016 ఫిబ్రవరి నుంచి 60 మంది ప్రభుత్వ ఉద్యోగులు కలిసి చేయూత సంస్థను ప్రారంభించామన్నారు. ఏలూరు, పెదపాడు, పెదవేగి, దెందులూరు, కామవరపుకోట, నిడదవోలు, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఇప్పటివరకు 105 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, ఆర్థికసాయం, దుస్తులు అందించామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

దివ్యాంగులకు బంగారు 'భవిత'

- భవిత కేంద్రాలతో చిన్నారులకు భరోసా
- ఫిజియోథెరపీతో మెరుగుపడుతున్న ఆరోగ్యం
- ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధన
- నియోజకవర్గంలో 988 మంది దివ్యాంగులు



పెదవేగి భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్న ఐఈఆర్టీ ఉపాధ్యాయులు

పెదవేగి : దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాలతో ఉపశమనం లభిస్తోంది. మానసిక, శారీరక, వినికిడి లోపం ఉన్న దివ్యాంగ చిన్నారులకు వైద్య సేవలతోపాటు విద్యను అందించేందుకు మండల కేంద్రాల్లో భవిత కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాల్లో దివ్యాంగ చిన్నారులను సాధారణ బాలల్లా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. దీంతో ఈ కేంద్రాలను ఆశ్రయిస్తున్న చిన్నారుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. నియోజకవర్గంలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో భవిత కేంద్రాలు, ఫిజియోథెరపీ శిబిరాల ద్వారా దివ్యాంగులకు చికిత్సతోపాటు వారికి అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. పెదవేగి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్రం నిర్వహిస్తున్నారు. పెదవేగి మండలంలో 225 మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ శిబిరం నిర్వహిస్తున్నారు. దెందులూరు మండలంలో 226 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరికి దెందులూరు ఉన్నత పాఠశాలలోనే ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. పెదపాడు మండలంలో 224 మంది దివ్యాంగులు ఉన్నారని, వారికి కొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలో, ఏలూరు రూరల్ మండలంలో 313 మంది దివ్యాంగులకు, కోటదిబ్బ దగ్గర నాన్ భవిత కేంద్రం ఏర్పాటు చేసి ఫిజియోథెరపీ శిబిరం నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

దివ్యాంగులకు ఎంతో మేలు

భవిత కేంద్రాలద్వారా దివ్యాంగులకు ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తున్నారు. అంధ, మూగ, చెవిటి, బుద్ధి మాంద్యం, ఇతరాత్ర శారీరక వైకల్య సమస్యలతో బాధపడే చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్స చేస్తున్నారు. వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన స్పెషల్ బీఈడీ, డీఈడీ అభ్యర్థులను ఐఈఆర్టీలుగా నియమించి భవిత కేంద్రాల్లో విద్యాబోధన చేయిస్తున్నారు. మానసిక వికలాంగులకు అర్థమయ్యే రీతిలో చదువు నేర్పేందుకు ప్రత్యేకంగా ఉపకరణాలు, ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నారు. వారానికి ఒక రోజు పిల్లల అవసరాల మేరకు స్పీచ్, విజన్ థెరపీ వంటి సదుపాయాలను కేంద్రాల్లో కల్పించడంతో చిన్నారుల్లో క్రమేపీ మార్పు కనిపిస్తోందని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగు



గ్రామాల నుంచి దివ్యాంగ చిన్నారులను మండల కేంద్రానికి తీసుకువచ్చేందుకు రవాణా ఖర్చులు చెల్లిస్తున్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను భవిత కేంద్రాలకు తీసుకురావాలి. ఇక్కడ ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్ల వారిలో ఎంతో మార్పు వస్తుంది. వారి జీవితాల్లో వెలుగులు నింపినట్లవుతుంది. అన్ని కేంద్రాల్లో సామగ్రిని ఏర్పాటు చేయడం వల్ల వారికి వ్యాయామం చేయించేందుకు వీలు కలుగుతోంది.

– కె.సోమరాజు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు

ఫిజియోథెరపీతో ఆరోగ్యం మెరుగు



పెదవేగి మండలంలో విజయరాయి, పెదవేగి గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఫిజియోథెరపీ శిబిరాన్ని ఇతర గ్రామాల్లోని ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలి. దీని వల్ల చిన్నారులకు ఎంతో మేలు చేకూరుతుంది. క్రమం తప్పకుండా దివ్యాంగ చిన్నారులను భవిత కేంద్రాలకు తీసుకు వెళితే అక్కడ అందించే ఫిజియోథెరపీ, పాఠ్యాంశాల బోధన ద్వారా వారి ఆరోగ్యం మెరుగవడంతోపాటు, మానసిక వికాసం కలుగుతుంది.

– జేమ్స్ బూన్, ఫిజియోథెరపిస్ట్, పెదవేగి

గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలు



గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి

భీమడోలు: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం భీమడోలు శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున అధికారుల సూచనలను పాటించి జాతీయ గ్రంథాలయాలను వారోత్సవాలను నిర్వహించాలన్నారు. విద్యార్థి దశ నుంచి పుస్తక పఠనాన్ని అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు రోజు వారీ కార్యక్రమాలు, పోటీల్లో విద్యార్థులు, కళాశాల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డ్రగ్స్‌పై అవగాహన, పర్యావరణ పరిరక్షణలో పౌరుల పాత్ర, మహిళా దినోత్సవం, గ్రంథాలయ ఉద్యమ నేతలను స్మరించుకోవడం, వివిధ వ్యాసరచన, వ్యక్తృత్వ పోటీలు, చిత్ర పోటీలను నిర్వహించడం సంతోషదాయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, కోశాధికారి మండే సుధాకర్, గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

దోమలతో వ్యాధుల వ్యాప్తి



తొట్టెలోని నీటిలో దోమల లార్వాను చూపుతున్న వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది

గణపవరం: దోమలతో ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, వాటిని అరికట్టడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చునని తాడేపల్లిగూడెం ఏరియా మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. సోమవారం గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని సంత మార్కెట్ ఏరియాలో చేపట్టిన కీటక నియంత్రణ కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలున్న చోట్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. నీటి తొట్టెలను ప్రతి వారం శుభ్రం చేయాలన్నారు. పాత సామాన్లు, కొబ్బరి బొండాలు వంటి వాటిని ఇళ్లకు దూరంగా ఉంచాలన్నారు. ఇంటి సమీపంలో మురుగునీటి గుంతలు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు, వాటి వ్యాప్తి, రక్షణ చర్యలపై మహిళలకు అవగాహన కల్పించారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి



బువ్వనపల్లిలో పోరుబాటలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

నిడమర్రు: బువ్వనపల్లిలోని వైఎస్సార్ (పాత) కాలనీ, జగన్న (కొత్త) కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు గవర సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం బువ్వనపల్లిలోని వైఎస్సార్, జగనన్న కాలనీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా లో ఓల్టేజ్ సమస్యలతో ఫ్రిజ్, టీవీలు వంటి ఎలక్ట్రికల్ గృహోపకరణాలు కాలిపోతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీల్లో పబ్లిక్ ట్యాప్‌లు లేకపోవడం, డ్రెయినేజీ, రహదారుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్టు సీపీఎం నాయకులు తెలిపారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న నిడమర్రు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం శ్రేణులు ప్రజలకు వివరించారు. ఆ ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కానూరు రాజు, అనిత లక్ష్మి తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలి




విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

గణపవరం: భారతదేశ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ కలలుగన్న అందరికీ విద్య అనేది నిజం కావాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. సోమవారం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీ య విద్యాదినోత్సవాన్ని కళాశాల తెలుగుశాఖ, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ దేశంలో అత్యున్నత విద్యా సంస్థలైన ఐఐటీలను ఏర్పాటు చేసి ఎందరో మేధావులను తయారు చేయడంలో గొప్ప పాత్ర పోషించారని వైస్ ప్రిన్సిపల్ మధురాజు అన్నారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం వంటి వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు జి.వెంకటరమణ, భాస్కరరావు, అక్కిరాజు, స్వరూపరాణి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

పెదవేగి : భారతదేశ విద్యా వ్యవస్థలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశేష సేవలందించారని కరుణోదయ పాఠశాల అధినేత డొమ్నిక్ అన్నారు. పెదవేగి మండలం వంగూరులోని కరుణోదయ మానసిక వికలాంగుల పాఠశాలలో భారత ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు బిస్కెట్, చాక్లెట్లు పంపిణీ చేసిన వల్లకవి శ్రీనివాసరావుకి పాఠశాల అధినేత డొమ్నిక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు, వ్యాఖ్యాత సొమ్ల నాయక్, విశ్రాంత ఉపాధ్యాయిని శేషారత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై ప్రత్యేక నిఘా



నారాయణపురం దాబాలో తనిఖీ చేస్తున్న సీఐ సత్యనారాయణ, ఎక్సైజ్ పోలీసులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో బెల్టుషాపులు, దాబాలను భీమడోలు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎస్సై శివదేర్, పోలీసులు సోదాలు చేశారు. సోమవారం ప్రత్యేక బృందంగా ఏర్పడి గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. వెల్లమిల్లి ,కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు, గొల్లగూడెం, ఎ.గోకవరం, నారాయణపురంలో బెల్టు షాపులపై ఆకస్మిక తనిఖీలు చేశారు. కైకరం, వెల్లమిల్లిలో రెండు బెల్టు షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. ఆగడాలంక, గండుగొలను పొలసానపల్లిలో 11 బెల్టు షాపులపై దాడి చేసి 178 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని 12 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. నారాయణపురం –గణపవరం రహదారిలోని దాబాలను తనిఖీ చేశామన్నారు. దాబాల్లో మద్యం విక్రయించడానికి, సేవించడం అనుమతి ఇవ్వవద్దని యజమానులకు సూచించారు. బెల్టుషాపులపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలపై 9440902429 నంబరుకు ఫోను చేసి సమాచారం తెలియజేయాలని సీఐ కోరారు.

కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు

భీమడోలు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తెచ్చి వాడవాడలా విచ్చలవిడిగా బెల్టు షాపులకు తెర తీసిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరులో భాగంగా సోమవారం భీమడోలు పంచాయతీ శివారు ఆర్జావారిగూడెంకు చేరింది. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు ప్రజలకు కరపత్రాలు అందించారు. లింగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత ఇసుక ఎవరికీ అందడం లేదన్నారు. నేతల కట్టా భాస్కరరావు, కల్లేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో ఉమా నీలకంఠేశ్వరస్వామి



మండలపర్రు పంచాయతన క్షేత్రంలో శివలింగం వద్ద దీపారాధనలో పాల్గొన్న భక్తులు

నిడమర్రు: పవిత్ర కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు వేకువ జాము నుంచే భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. మండలపర్రు ఉమానీలకంఠేశ్వర స్వామి పంచాయతన క్షేత్రంలో ప్రత్యేక అభిషేకాలు, హారతులు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులతో కార్తీక దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో 5వేలకు పైగా భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పిప్పర శివాలయంలో కార్తీక పూజలు

గణపవరం: గణపవరం మండలం పిప్పర శివాలయంలో సోమవారం కార్తీక వనసమారాధన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సామాజిక సేవకుడు కొలనువాడ సుబ్బరాజు ఆధ్వర్యంలో ఏటా కార్తీకమాసంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక పూజల్లో పాల్గొని ఉసిరి చెట్టుకు పూజలు, దీపారాధన చేశారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. మంగళవారం ఉదయం శివాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తామని సుబ్బరాజు తెలిపారు. వ్రతంలో పాల్గొనే మహిళలకు వ్రతం ప్రతిమ, స్వామివారి ప్రసాదం, జెండా అందిస్తామని, వ్రతంలో పాల్గొన్నవారందరికీ అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు.

50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలి

దెందులూరు: రైతులకు, కౌలు రైతులకు 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలని, వాయుగుండం హెచ్చరికల నేపథ్యంలో తేమ శాతం నిబంధన సడలించి, ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని, వరి కోత యంత్ర కిరాయిలను అధికారులు నియంత్రించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. సోమ వారం ఏపీ రైతు సంఘం నాయకులు దెందులూరు మండలంలోని సత్యనారాయణపురం, ఉండ్రాజవరంలో పర్యటించి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. రైతులను, కౌలు రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఇంతవరకు ఎవరికీ చేరలేదన్నారు. వర్షాలు వస్తే పంటను రక్షించుకోవడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఎకరాకు యంత్రంతో వరి కోతకు రూ.10వేలకు పైగా వ్యయమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గంటకు రూ.3వేలకు పైగా కోత కిరాయిలు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యంత్రాల యజమానులు, రైతులతో మాట్లాడి కోత కిరాయిలు నిర్ణయించి, వ్యవసాయ శాఖ అధికారులు పరివేక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు సున్నా వెంకట్రావు, ఎస్. దుర్గారావు, ఎం. రాంబాబు, కౌలు రైతులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతిలో జాప్యం తగదు




పూళ్లలో రైస్ మిల్లుల యాజమానులను ప్రశ్నిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

భీమడోలు: రైస్ మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని దింపుకోవడంలో ఎందుకు అలస్యం చేస్తూ రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నారని రైస్ మిల్లు యాజమానులపై ఏలూరు జేసీ ధాత్రి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. పూళ్ల పరిధిలోని రెండు రైస్‌మిల్లుల్లో ధాన్యం దిగుమతిలో ఆలస్యం జరుగుతుందన్న విషయం తెలుసుకున్న జేసీ సోమవారం ఆకస్మిక తనిఖీ చేసారు. ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంతో ఎందుకు జాప్యం చేస్తున్నారని రైస్ మిల్లు యాజమానులను ఆమె ప్రశ్నించారు. హమాలీలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యం వచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతుకు ఇబ్బంది కలుగకుండా సకాలంలో ధాన్యం సేకరణ పోర్టల్‌లో ధాన్యం రైస్ మిల్లుకు చేరినట్లుగా, దించుకున్నట్లుగా ధ్రువీకరించాలని ఆమె ఆదేశించారు. ఏలూరు జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు రూ.15.98 కోట్ల విలువైన 7101 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసామన్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యం వారు కోరిన రైస్‌మిల్లుకు తరలించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినందున నిర్ధారిత నాణ్యతా ప్రమాణాలు పాటించి కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలని రైతులకు సూచించారు. రైస్ మిల్లర్లు ప్రత్యేకంగా వ్యక్తిగత శ్రద్ధ వహించాలని, సకాలంలో రైతు విక్రయించిన ధాన్యాన్ని దిగుమతి చేయాలన్నారు. సొంత వాహనం గల రైతులు వారి వాహన వివరాలతో సంబంధిత రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ధాన్యం తరలించడానికి ముందుగా వాహనం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు జిల్లా యంత్రాంగం చేపట్టిందన్నారు. తహసీల్దార్ బి.రమాదేవి, పౌరసరఫరాల విభాగం జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సాంబశివరావు మృతి

దెందులూరు: గాలాయగూడెం మాజీ సర్పంచ్ పల్లి సాంబశివరావు సోమవారం మృతి చెందారు. ఇటీవల అద్దంకి ప్రాంతంలో ఆయన రోడ్డు ప్రమాదానికి గురై గుంటూరు వైద్యశాలలో చేరారు. మాజీ సర్పంచ్ మృతి పట్ల పలువురు నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

మరణానంతరం నేత్రదానం



ఎం.పాండు రంగ విఠల్ కొండల రాయుడు (ఫైల్)

భీమడోలు: గుండుగొలనుకి చెందిన రైతు మొగళ్ల పాండురంగ విఠల్ కొండలరాయుడు (64) మరణానంతరం ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. గుండుగొలనులో ఆయన ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. హైదరాబాద్‌కు చెందిన అమ్మా నేత్ర, అవయవ, శరీర దానం ప్రోత్సాహిక సంఘం ఏలూరు జిల్లా కోఆర్డినేటర్ టి.సుమన్‌బాబు ప్రోద్బలంతో పాండు కుటుంబ సభ్యులు నేత్రదానికి అంగీకరించారు. కంటి వైద్య నిపుణులు ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సిబ్బంది, స్థానిక నిడదవోలు రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంకు సిబ్బంది పాండు కార్నియాలను సేకరించారు. సమాజం పట్ల బాధ్యతగల ప్రతిఒక్కరూ నేత్రదానం, అవయవ దానం, శరీరదానం చేయడానికి ముందుకురావాలని సుమన్‌బాబు కోరారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దెందులూరు: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఏలూరు జిల్లా దెందులూరు మండలం పోతునూరు ఉన్నత పాఠశాల మేదినరావుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. చిత్తూరులో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో పోతునూరుకు చెందిన డి.లాస్య, సీహెచ్ జెస్సికా రజత పతకాలు, ఎన్ సులోచన కాంస్య పతకం, మేదినరావుపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన కె శాంతి రజత పతకం సాధించారు. రాష్ట్రస్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శిక్షణ నిచ్చిన పోతునూరు ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం కృష్ణారావు మేదినరావుపాలెం ఉన్నత పాఠశాల పీడీ ఎల్‌వీడీ రవిబాబును పలువురు అభినందించారు.